శుక్ర వారం
09-06-2023
సంపుటి - 08,
సంచిక - 323
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## పాలమూరు అంటే ఒకప్పుడు మైగ్రేషన్



ఇప్పుడు మాత్రం పచ్చని పంటలతో ఇరిగేషన్

తెలంగాణ అభివృద్ధికి ఇదే నిదర్శనం

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి కేటీఆర్ భూమిపూజ

**మహబూబ్‌నగర్, జూన్ 8 (సమ సమాజం):** ఒకప్పుడు మహబూబ్‌నగర్ అంటే మైగ్రేషన్ అని.. ఇప్పుడు మహబూబ్‌నగర్ అంటే ఇరిగేషన్ అని ఐటీ, పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. పాలమూరును పచ్చబర్చిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. మహబూబ్‌నగర్ పిల్లలమర్రి రోడ్డులో ఉన్న బాలికల ఐటీఐ కళాశాలలో సెయింట్ ఫౌండేషన్న, శాంతా నారాయణ గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి కేటీఆర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి అందజేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ డబ్బులు చాలా మందికి ఉండవచ్చు కానీ.. మంచి చేయాలనే ఆలోచన రావడం గొప్ప విషయమన్నారు. మోహన్‌రెడ్డి ఇక్కడ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం గొప్ప విషయమంటూ ప్రశంసించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వెయ్యి గురుకులాలు ఏర్పాటు చేసిందని, 6లక్షల మంది విద్యార్థులకు అత్యుత్తమ విద్య అందించి, పెద్ద వ్యవస్థల్లో సీట్లు సంపాదిస్తే తమకు ఎంతో ఆనందకరమైన

3వ పేజీలో...



## మృగశిరకార్తె ప్రవేశంతో తొలకరి

సర్వకోటి జీవాలకు

తొలకరిజల్లులతో స్వాంతన

**యాదగిరిగుట్ట, జూన్ 8 (సమ సమాజం):** మృగశిర కార్తె వచ్చిందంటే సకలజనులకు వూరట కలుగుతుంది. అప్పటివరకు గ్రీష్మతాపంతో అల్లాడుతున్న సర్వకోటి జీవాలు తొలకరిజల్లులతో స్వాంతన చెందుతారు. రోహిణికార్తెలో రోళ్లు పగిలే ఎండలు కాస్తాయి. అనంతరం మృగశిర కార్తె వస్తుంది. రుతుపవనాల రాకను మృగశిరకార్తె ఆహ్వానిస్తుంది. చంద్రుడు ఏ నక్షత్రంలో ప్రవేశిస్తే ఆ రాశి ప్రారంభమవుతుంది. జింక తల కలిగివుండటంతో ఈ కార్తెను మృగశిరకార్తెగా వ్యవహరిస్తారు. ఈ కార్తె మనదేశంపై విశేషప్రభావం చూపుతుంది. ఎందుకంటే ఈ రాశిలోనే నైరుతి రుతువపనాలు భారత్‌లోకి ప్రవేశిస్తాయి. అప్పటివరకు నిప్పులు చెలరేగిన భానుడి కిరణాలు నల్లటి మేఘాల ప్రభావంతో చల్లబడుతాయి. దేశానికి జీవధార అయిన వర్షాలతో నేలతల్లి పులకరిస్తుంది. రైతులు

3వ పేజీలో...


## 1000 నోటు రాదు.. 500 నోటు పోదు..

అసత్య ప్రచారాలు, వదంతులను నమ్మొద్దు ● ఆర్‌బి గవర్నర్ శక్తికాంత్ దాస్ ప్రకటన ● 35 శాతం 2వేల నోట్లు బ్యాంకుల్లో జమ









**ముంబై, జూన్ 8 (సమ సమాజం):** దేశంలో నోట్ల రద్దు, ఉపసంహరణపై పెద్ద ఎత్తున ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్న వేళ.. 500 నోటు రద్దు విషయంలో ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ కీలక ప్రకటన చేశారు. . ప్రజల్లోనూ ఎన్నో సందేహాలతోపాటు వార్తలు ప్రచారంలోకి వస్తున్నాయి. మొన్నటికి మొన్న 2 వేల నోట్ల రూపాయలు ఉప సంహరణ తర్వాత.. వెయ్యి రూపాయల నోట్లు మళ్లీ వస్తాయనే ప్రచారంతోపాటు.. 500 రూపాయల నోట్లను కూడా రద్దు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. దీనిపై ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్.. గురువారం ఓ ప్రకటన చేశారు. వడ్డీ రేట్ల విషయంపై జరిగిన సమావేశంలో.. 500, వెయ్యి నోట్ల ప్రచారంలో కీలక ప్రకటన చేశారు. మళ్లీ వెయ్యి రూపాయల నోట్లను తీసుకు వచ్చే ఉద్దేశం, ఆలోచన అస్సలు లేదని స్పష్టంగా చెప్పారు. అదే విధంగా 500 రూపాయల నోట్లను ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తీసుకునే ఆలోచన సైతం లేదని వివరించారు.. ఇలాంటి ప్రచారం ఎందుకు జరుగుతుందో.. ఎందుకు చేస్తున్నారో అర్థం కావటం లేదని.. ప్రజలు ఎవరూ ఇలాంటి వార్తలను నమ్మొద్దని సూచించారు. పదే పదే చెబుతున్నాం.. వెయ్యి నోటు రాదు.. 500 రూపాయలు నోటు పోదు అని తేల్చిచెప్పారాయన. ఈ విషయాలపై ప్రజల్లో ఉన్న గందరగో ళాలను తొలగించాల్సిన బాధ్యత మీడియాపై ఉందని శక్తికాంత్ దాస్ అన్నారు. ప్రస్తుతానికి మార్కెట్ లో అతిపెద్ద నోటు 500

3వ పేజీలో...

## భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ పై కౌంటర్

### ఎ8గా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** వైఎస్ వివేకా హత్య కేసులో భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ పై కౌంటరులో సీబీఐ అధికారులు పలు సంచలన అంశాలు ప్రస్తావించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఎనిమిదో నిందితుడు ఎ8గా పేర్కొన్నారు. కుట్ర, సాక్ష్యాల చెరిపివేతలో అవినాష్ రెడ్డి, భాస్కర్‌రెడ్డిల ప్రమేయం ఉందని పేర్కొన్నారు. దర్యాప్తును పక్కదారి పట్టించేలా తండ్రీ కుమారులు నిరంతరం ప్రయత్నిస్తున్నారని స్పష్టం చేశారు. వివేకా హత్యకు కుట్ర, సాక్ష్యాల ధ్వంసం వెనక భారీ కుట్రపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఎన్.శివశంకర్ రెడ్డి ఫోన్ చేసిన నిమిషంలోపే అవినాష్ రెడ్డి హత్యస్థలికి చేరుకున్నారని, ఆ రోజు ఉదయం 5:20 గంటలకు ముందే అవినాష్ రెడ్డి, శివశంకర్‌రెడ్డిలతో గంగిరెడ్డి మాట్లాడినట్లు దస్తగిరి వాంగ్మూలం ఇచ్చినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. కేసు పెట్టొద్దని,

3వ పేజీలో...

## ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ అరికట్టండి

స్కూల్ ఎడ్యుకేషన్ ముందు బిజెవైఎం ధర్నా

**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** హైదరాబాద్ లక్డీకపూల్ లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం దగ్గర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలలో అధిక ఫీజులను అరికట్టేందుకు ఫీజు



2వ పేజీలో...

## పేపర్ లీకులో మరో ఇద్దరికి బెయిల్

**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో మరో ఇద్దరికి బెయిల్ మంజూరు అయింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న తండ్రి కొడుకులు మైబయ్య, జనార్ధన్ లకు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. టీఎస్పీఎస్సీ ఏఈ పేపర్ లీకేజీ కేసులో మైబయ్య జనార్ధన్ లను సిట్ అధికారులు ఏప్రిల్ 21న అరెస్ట్ చేశారు. డాక్య నాయక్ అనే వ్యక్తి నుంచి మైబయ్య తన కుమారుడు జనార్ధన్ కోసం రూ. 2 లక్షలకు ఏఈ ప్రశ్న పత్రాన్ని కొనుగోలు చేసినట్లు సిట్ అధికారులు తేల్చారు. ఈ కేసులో తాజాగా మైబయ్య అతని కొడుకు జనార్ధన్ లకు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఇప్పటి వరకు ఈ కేసులో బెయిల్ పొందిన వారి సంఖ్య 17కు చేరింది.

## దూరదర్శన్ తొలి యాంకర్ గీతాంజలి అయ్యర్ మృతి

**న్యూఢిల్లీ, జూన్ 8 (సమ సమాజం):** దూరదర్శన్ తొలి ఇంగ్లీష్ యాంకర్ గీతాంజలి అయ్యర్ బుధవారం మృతి చెందారు. ఆమె వయస్సు 76 ఏళ్లు. కొంత కాలం నుంచి అమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం న్యూఢిల్లీలోని స్వగృహంలో కొంత అస్వస్థతకు గురికాగా,



2వ పేజీలో...

## ఎట్టకేలకు రుతుపవనాల రాక

కేరళను తాకిన నైరుతి పవనాలు

తెలంగాణలో వడగాలులు..రెండ్రోజులపాటు వర్షాలు



**న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** గత వారం రోజులుగా దోబూచులాడుతున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు భారత్‌లోకి ప్రవేశించాయి. కేరళ వద్ద రుతుపవనాలు తీరాన్ని తాకాయి. ఈ విషయాన్ని భారత వాతావరణ శాఖ ఐఎండీ అధికారికంగా ప్రకటించింది. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేస్తుంటాయి. అయితే వాతావరణ పరిస్థితుల ప్రతికూలత కారణంగా వారం రోజులు ఆలస్యంగా దేశంలోకి వచ్చాయని వాతావరణ శాఖ వెల్లడించింది. క్షద్వీప్, కేరళ ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాల ఆగమన ప్రభావంతో కేరళలో గత 24 గంటలుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అలప్పుజా, ఎర్నాకుళం ప్రాంతాల్లో వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కర్ణాటక, తమిళనాడు మీదుగా కదిలేందుకు వాతావరణం అనుకూలంగా ఉందని ఐఎండీ తెలిపింది. వారం రోజుల్లో ఇవి రాయలసీమలోకి ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. తెలంగాణలో మరో మూడురోజులు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి

2వ పేజీలో...

## నేడు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేపమందు పంపిణీ

**హైదరాబాద్, జూన్ 8 (సమ సమాజం):** మృగశిర కార్తె సందర్భంగా శుక్రవారం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉదయం 8.00 గంటల నుంచి చేపప్రసాదం పంపిణీ చేయనున్నట్లు పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ చేప ప్రసాదం పంపిణీకి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు



3వ పేజీలో...

## రైతు మరణాలన్నీ ఆత్మహత్యలు కావు

వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్



**వరంగల్, జూన్ 8 (సమ సమాజం):** రైతుల ఆత్మహత్యలపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గ్రామాల్లో జరుగుతున్న ఆత్మహత్యలు రైతు బలవన్మరణాలు కాదని వ్యాఖ్యానించారు. గుండెపోటు, అనారోగ్యం, ఇతర కారణాలతో చనిపోయిన వారిని కూడా రైతు ఆత్మహత్యలగానే నమోదు చేస్తున్నారని చెప్పారు. గతంలో ఎవరైనా రైతు ఆత్మహత్య చేసుకుంటే లక్ష రూపాయల పరిహారం ఇచ్చేవారని, అందువల్ల రైతు ఆత్మహత్యగా కేసు నమోదు చేసేవాళ్లమన్నారు. ఇప్పుడు ఒక లక్ష స్థానంలో ఐదు లక్షల రైతుబంధు పథకం అమల్లోకి వచ్చిందని సీపీ రంగనాథ్ వ్యాఖ్యానించారు. రైతు ఎలా చనిపోయినా గతంలో మాదిరిగా రైతు ఆత్మహత్య అని వివరాలు పొందుపరచడం వల్లే.. ఈ సంఖ్య పెద్దగా కనబడుతోందని చెప్పారు. సీపీ రంగనాథ్ వ్యాఖ్యలపై రైతు సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## సంపాదకీయం

# ధరణి మర్మమేమిటో తెలుసుకోండి !

ధరణి పోర్టల్ చుట్టూ వివాదాలు ఉన్నాయి. గ్రామాల్లో ధరణితో తాము నష్టపోతున్నామంటూ ఆందోళనల చెందుతున్నారు. దీన్ని రద్దు చేయిస్తామని కాంగ్రెస్, బిజెపిలు ప్రకటించింది. ధరణితో కెసిఆర్, ఆయన అనుచరులు భూములను సొంతం చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నాయి. అయితే ధరణి మొదలు పెట్టిన ప్పటి నుంచే వివాదాలు, రైతుల ఆత్మహత్యల బెదిరింపులు, పంచాయితీలు, కొట్లాటలు నడుస్తున్నాయి. దీనిని సవరిస్తామని ప్రభుత్వం అడపాదడపా ప్రకటించినా ఎందుకనో పట్టించుకోవడం లేదు. సరికాదా తాజాగా ధరణిపై విమర్శలు చేసే వారిని బంగాళాఖాతంలో విసిరేయాలని సిఎం కెసిఆర్ స్వయంగా పిలుపునిచ్చారు. మొత్తంగా ధరణి పోర్టల్ వివాదం తెలంగాణలో పెను రాజకీయ ప్రకంపనలనే రేపుతోంది. ఇటీవల నిర్మల్ కలెక్టరేట్ ప్రారంభం, నాగర్ కర్నూల్ లో కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ పై చేసిన వ్యాఖ్యలు మరోసారి ప్రతిపక్ష పార్టీలలో కాకరేపుతున్నాయి. ధరణి పోర్టల్‌ను బంగాళా ఖాతంలో కలిపేద్దాం అన్న పార్టీలనే బంగాళాఖాతంలో కలిపేయాలంటూ కాంగ్రెస్, బీజేపీలపై సీఎం కేసీఆర్ విమర్శలు గుప్పించారు. ధరణి పోర్టల్ గ్రామీణ స్థాయిలో అవినీతి వ్యవస్థకు చెక్ పెట్టిందని కేసీఆర్ బలంగా విశ్వసిస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో రైతులు తమ భూములపై హక్కు పొందేందుకు, పాస్ బుక్ లో తమ భూములు నమోదు చేయించుకునేందుకు చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేదని, ధరణి పోర్టల్ వచ్చాక ఆ పరిస్థితి మారిపోందంటున్నారు. కేవలం ధరణి పోర్టల్ కారణంగా రైతులకు రైతు భరోసా మొదలు రైతు భీమా వరకు బటన్ నొక్కిన వెంటనే నేరుగా ఖాతాల్లోకి చేరుతోందన్నారు. గత ప్రభుత్వాల్లో జరిగిన వీఆర్వోల దోపిడీకి ధరణి పోర్టల్ వల్లనే చెక్ పెట్టగలిగామని కేసీఆర్ పదేపదే చెబుతున్నారు. రైతుల భూములు ఒక్కసారి ధరణి పోర్టల్ లో నమోదైతే, వాటిని మార్చాలంటే ఎమ్మార్వో నుంచి రెవెన్యూశాఖ మంత్రివరకు సైతం ఎవరూ మార్చలేరని,చివరికి సీఎం కేసీఆర్ సైతం మార్చడం సాధ్యంకాదన్నారు. కేవలం రైతు మాత్రమే తన వేలిముద్రతో మార్పులు చేసుకోవడం సాధ్యమవుతుందని.. అంతలా రైతు భూములను పారదర్శకంగా డిజిటలైజేషన్ చేశామని కేసీఆర్ అంటున్నారు. ఇప్పటికే మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాలు సైతం ధరణి పోర్టల్ పై ప్రశంసల కురిపిస్తున్నాయి. సమస్యలు పరిష్కరిస్తాం కానీ ధరణి పోర్టల్ ఎత్తివేసే ప్రసక్తేలేదంటోంది బీఆర్ఎస్. ధరణి పోర్టల్ అంశంపై సీఎం కేసీఆర్ పదేపదే వ్యాఖ్యలతో తెలంగాణలో మరోసారి ధరణి పోర్టల్ పొలిటిక్ అగ్గి రాజేయడంతోపాటు రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు ప్రధాన అస్త్రంలా మారుతుందా అనేది ఆసక్తికరంగా మారింది.అయితే దీనిపై కెటిఆర్,హరీశ్ రావులు గతకొంతకాలంగా ఇదే ప్రకటన చేస్తూ వచ్చారు. కొన్ని లోపాలను సరిదిద్దుతామని అంటున్నారు. నిజానికి ధరణిలో వస్తున్న ఆరోపణలపై మాత్రం ఎక్కడా చర్యలు తీసుకోవడం లేదు. నిజానికి దశాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్న సందర్భంగా ఈ దిశగా లోతైన విశ్లేషణలు జరగాలి. ధరణి లోపాలను సరిదిద్దాలి. వ్యవసాయ రంగ నిపుణులు, ఆర్థికవేత్తలు, సామాజికవేత్తల సలహాలు తీసుకోవాలి. ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ పెడితే గానీ లోపాలు బయటపడవు. అధికారపార్టీ బీఆర్ఎస్ వాదన ధరణి వల్ల అంతా మంచి జరుగుతోందని అన్నట్లుగా ఉంది. ప్రతిపక్ష పార్టీల గొంతు మరోలా వినిపిస్తోంది. ధరణి పోర్టల్ వల్ల అనేక అవకతవకలు జరుగుతున్నాయని కాంగ్రెస్, బిజెపి నేతలు పదేపదే ఆరోపిస్తున్నారు. నిజానికి అఖిలపక్షం ఏర్పాటు చేసి మంచీచెడులను చర్చించడంలో తప్పులేదు. అయితే విపక్షాలను ఏనాడూ విశ్వాసంలోకి తీసుకోని కెసిఆర్.. తను అనుకున్నదే కొనసాగిస్తున్నారు. హక్కుదారుడి పేరుతో పట్టా ఉండి, కొన్ని దశాబ్దా లుగా భూమి సాగుచేస్తున్నా ధరణి పోర్టల్‌లో మాత్రం హక్కుదారుడి పేరుతో కాకుండా వేరే వారి పేరుతో

సాగుభూమి నమోదవుతున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయి. వీటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా మండలాల్లో ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్ ఆపరేటర్ల వ్యవస్థలో అనేక లోపాలున్నాయంటున్నారు. భూములు రికార్డుల నుండి తొలగించి, వాటిని ధరణిలో చేర్చాలంటే లంచాలు డిమాండ్ చేస్తున్నారంటూ కొందరు ఆపరేటర్లపై విమర్శలు గుప్పిస్తు న్నారు. వ్యవసాయ భూములు డిజిటలైజేషన్ చేయడం ద్వారా నేరుగా లబ్దిదారులైన రైతులకే ప్రభుత్వ పథకాలు వర్తించేలా చేయడంతో పాటు ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ వివాదాలకు చెక్ పెట్టాలనేది బీఆర్ఎస్ సర్కార్ ఉద్దేశ్యం. ఆలోచన మంచిదే అయినా ఆచరణలో సమస్యలు తలెత్తితే విమర్శలు తప్పవు. ధరణి పోర్టల్ విషయంలో ఇదే జరుగుతోందని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. ప్రభుత్వం సంకల్పం మంచిదైనా క్షేత్రస్థాయిలో లబ్దిదారులు సమస్యలు ఎదుర్కోవడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కుంటోంది. ఇలాంటి సమస్యలు చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేసివుంటే బాగుండేది. ధరణి పోర్టల్ వేగంగా అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో కేసీఆర్ సర్కార్ మండలానికో ఆపరేటర్లను నియమించింది. ఎమ్మార్వోలకు సహకరిస్తూ సాంకేతిక లోపాలను సరిదిద్దుతూ రైతుల భూములను డిజిటలైజేషన్ చేయాలి. కానీ ఇప్పుడు అదే ఆపరేటర్ల వ్యవస్థ ధరణి పోర్టల్ ఇంతలా విమర్మలు ఎదుర్కోవడానికి ప్రధాన కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. రికార్టులలో ఉన్న భూములు తొలగించి, తిరిగి వాటిని చేర్చడానికి లంచాలు డిమాండ్ చేయడమనేది ప్రధానంగా ధరణిపై వస్తున్న ఆరోపణ. రహదారుల ప్రక్కన ఉన్న భూములను ధరణి పోర్టల్ లో కలిపేయడం, భూ యజమానికి సమాచారం లేకుండా హక్కుదారుల పేర్లు తొలిగించడం, భూయజమాని బ్రతికే ఉన్నా.. చనిపోయినట్లుగా చిత్రీకరించి, ఆ భూమిని మరొకరిపేరుతో ధరణి పోర్టల్ లో నమోదు చేయడం ..ఇలా ఒకటేమిటి అనేక అవకతవకలు ఉన్నాయంటున్నాయి ప్రతిపక్షపార్టీలు.తాము అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్ ను బంగాళాఖాతంలో కలిపేస్తామంటూ తీవ్ర విమర్శలతో కాంగ్రెస్ పార్టీ విరుచుకుపడుతోంది . బీజేపీ సైతం నిరసనలు, ఆరోపణలతో ధరణి పోర్టల్ కు వ్యతిరేకంగా పోరాడుతోంది. అయితే ప్రతిపక్ష పార్టీలకు గట్టి కౌంటర్ ఇవ్వడంతోపాటు ధరణి పోర్టల్ విషయంలో వెనక్కు తగ్గబోమన్న ట్లుగా తాజాగా కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. ధరణి పోర్టల్ ఎత్తివేస్తే తిరిగి మళ్లీ జమిందారీ వ్యవస్థ వస్తుంది. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

# ఎన్నికల వ్యూహాలతో పథకాలకు పదును

## దశాబ్ది ఉత్సవాలతో ప్రచార హోరు• ఆరు నెలలకు ముందే అంతుచిక్కని వ్యూహం



హైదరాబాద్,జూన్7(సమ సమాజం): తెలంగాణ సీఎం కేసీఆర్ రాజకీయ వ్యూహాల్లో అపర చాణక్యుడు. ఎన్నికలకు ఆరు నెలలముందే ప్రచారంలో దూకుడు పెంచారు. పథకాలను అమలు చేస్తూనే...వాటిని ప్రజల్లో బలంగగా తీసుకుని వెళ్లేందుకు దశాబ్ది ఉత్సవాలను బాగా ఉపయోగించుకుంటున్నారు. అందుకే ఆయన చాణక్యం విషయాన్ని రాజకీయ ప్రత్యర్థులు కూడా ఒప్పుకోక తప్పదు. వచ్చే ఎన్నికల్లో గెలవడానికి ఆయన ఎలాంటి వ్యూహాలను పన్నుతున్నారో కూడా చాలా మందికి అంతుబట్టని అంశంగా మారింది. కేసీఆర్ వ్యూహాల్లో ఓటర్లను పథకాల్లో ముంచడం అనేది కీలకంగా ఉంటుందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. మూడోసారి అధికారంలోకి రావడానికి నాలుగు నెలల్లో నలభై వేల కోట్ల రూపాయలు ఓటర్లకు లబ్ది చేకూర్చ బోతున్నట్లుగా బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ ప్రజలకు వచ్చే నాలుగు

నెలల పాటు పథకాల పంట పండనుంది. కసీఆర్ వచ్చే నాలుగు నెలల పాటు ఓటర్లందరికీ నలభై వేల కోట్లు పంచడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇందు కోసం అనేక రకాల పథకాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. వివిధ పథకాలను అమలు చేయడంతోపాటు.. పెండింగ్‌లో ఉన్న వాటికీ నిధులు మంజూరు చేయనున్నారు. కేసీఆర్ అమ్ములపొదిలో ఇప్పటికీ చాలా పథకాలు రెడీగా ఉన్నాయి. ఇకపోతే దశాబ్ది ఉత్సవాలను కూడా తన ప్రచారాలకు బాగా వినియోగిస్తున్నారు. రోజుకో పథకంపై ఊరూవాడా ప్రచారం చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పథకాలపై విస్తృతంగా ప్రచారం చేస్తూ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. కెసిఆర్ కూడా పలు జిల్లాల్లో పర్యటించేలా ప్లాన్ సిద్దం చేసుకున్నారు. నిర్మల్, నాగర్ కర్నూలు జిల్లాలు పర్యటించారు. ఇకపోతే ఎప్పట్లాగే రైతుబంధు నిధులు కూడా ఈసారి ఎన్నికల సమయంలోనే రైతుల ఖాతాల్లో పడతాయి. ఇక కొత్తగా ప్రవేశ పెట్టిన దళితబంధు, గృహలక్ష్మి, బీసీలకు రూ.లక్ష ఆర్థిక చేయూత అమలును ప్రారంభిచేస్తున్నారు. బీసీలకు రూ. లక్ష కావాలంటే దరఖాస్తు చేసుకోండి అనే లింక్ కూడా ఇప్పటికే అందుబాటులోకి తెచ్చేశారు. దీనిని మంచిర్యాలలో సిఎం కెసిఆర్ శుక్రవారం ప్రారంభించ నున్నారు. దీంతో పాటు గృహలక్ష్మి స్కీమ్ కింద రూ.3 వేల కోట్ల నుంచి రూ.4వేల కోట్ల దాకా ఇవ్వనున్నారు. బీసీలకు ఆర్థిక చేయూత కింద ఇచ్చే రూ.లక్ష కోసం రూ.2 వేల కోట్లు ఖర్చు చేయనుంది. రుణమాఫీ కోసం రూ.6 వేల కోట్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే పెద్ద ఎత్తున ప్రచారం కల్పించడంలో కూడా కెసిఆర్ దిట్ట. ప్రచారం కోసం ఎతయినా ఖర్చు చేస్తారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, స్కాలర్‌షిప్‌లు, కేసీఆర్ కిట్, పల్లెలకు, మున్సిపాలిటీలకు, మన ఊరు మన బడి వంటి వాటికి కూడా ఇప్పుడు వరుసగా నిధులు మంజూరు కానున్నాయి. సెప్టెంబర్ దాకా ప్రతి స్కీమ్‌కు రూ. వేల కోట్లు విడదలవుతూ ఉంటాయి. వానాకాలం సీజన్ రైతుబంధుకు రూ.7,500 కోట్లు రైతు ఖాతాల్లో జమ చేయనున్నారు. దళితబంధు కోసం 5వేల కోట్ల మేర ఖర్చు చేస్తామని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. గిరిజన సంక్షేమ శాఖలో కొన్ని సబ్సిడీ స్కీముల కోసం రూ.300 కోట్లు ఖర్చు చేస్తారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు, మన ఊరు మన బడి, స్కాలర్ షిప్ లు తదితరాలకు రూ.6 వేల కోట్లు విడుదల చేస్తామని ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు.

న్ని వేల కోట్లకు పథకాలు పెట్టేస్తే .. మరి నిధులు ఎక్కడ నుంచి వస్తాయన్నది చాలా మందికి వచ్చే డౌట్. దీని కోసం కేసీఆర్ ఇప్పటికే మాస్టర్ ప్లాన్ రెడీ చేశారు. ఓఆర్అర్ లీజు, భూముల అమ్మకం, ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో ఆర్బీఐ నుంచి బహిరంగ మార్కెట్ రుణాలు .. తెలంగాణ సర్కార్‌కు వచ్చే ఆదాయం ఇలా.. అనేక వనరుల నుంచి సమీకరించుకుంటారు. ఎక్కువగా సంపదను అమ్మడం ద్వారానే సమీకరించుకుంటారని అంటున్నారు. కేసీఆర్ ప్లాన్ అనుకున్నట్లుగా జరిగితే.. నాలుగు నెలల్లో మెజార్టీ ఓటర్లకు ప్రభుత్వం నుంచి నేరుగా నగదు అందుతుంది. ఇకపోతే ఇంతకాలం కేసీఆర్ ఎప్పుడు మీడియా ముందుకొచ్చినా..బహిరంగ సభలో మాట్లాడినా మాటకు ముందు.. వెనుక బీజేపీని దుమ్మెత్తి పోస్తుండేవారు. కేంద్రంలోని బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చేశారు. అయితే ఇటీవల జరుగుతున్న కొన్ని పరిణామాలు చూస్తుంటే ఎందుకో ఒకప్పటి బద్ధ శత్రువైన బీజేపీ.. ఇప్పుడెందుకో మిత్రపక్షంగా మారిపోయిందేమోననే అనుమానాలు వస్తున్నాయి. దేశ వ్యాప్తంగా పెను ప్రకంపనలు రేపిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఇన్నాళ్లు ఆరోపణలు, విచారణ ఎదుర్కొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేరు ఈ మధ్య ఎక్కడా వినిపించట్లేదు.. కనిపించట్లేదు. దీంతో బీఆర్ఎస్-బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం జరిగిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఒకప్పుడు అదిగో అరెస్ట్.. ఇదిగో అరెస్ట్ అన్న బీజేపీ..

ఇప్పుడు చప్పుడు చేయట్లేదు. అటు దర్యాప్తు సంస్థలు కూడా మిన్నకుండిపోయాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ మధ్య అస్సలు బీజేపీని కేసీఆర్.. కేసీఆర్‌ను బీజేపీ నేతలు విమర్శించిన పరిస్థితుల్లేవు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఏకైక ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్సేనని పదే పదే ఇలా కేసీఆర్ చెప్పకనే చెబుతున్నారని అర్థం చేసుకోవచ్చు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరన్న విషయాన్ని కేసీఆర్ నిజం చేసేశారేమోనని సోషల్ మీడియాలో నెటిజన్లు చర్చించు కుంటున్నారు.

# కాంగ్రెస్‌ను నమ్ముకుంటే మళ్లీ కరెంట్ కోతలు

## పన్నెండ్లలో వాతలు..నట్టేట ముంచడం ఖాయం



### జడ్జర్లలో డబుల్ ఇళ్ల ప్రారంభంలో మంత్రి కెటిఆర్

జడ్చర్ల,జూన్8(సమ సమాజం): కాంగ్రెస్ ఓటు వేస్తే మళ్లీ రూ.200 పెన్షన్, 3 గంటల కరెంటు వస్తుందని మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. కరెంట్ కోతలు,పెన్షన్ల కోతలు తప్పవన్నారు. వారిని నమ్ముకుంటే నట్టేట ముంచి పోతారని ,ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వారు మంచిచేస్తే మళ్లీ యాత్రల పేరుతో ఎందుకు వస్తారని అన్నారు. జడ్చర్లలో డబుల్ బెడ్రూం ఇండ్లకు మంత్రికెటిఆర్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో పెన్షన్ కూడా సరిగా వచ్చేది కాదన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలోనే 32,477 మందికి నెలకు రూ.2వేలు, రూ.3వేల చొప్పున ఆసరా పెన్షన్లు ఇచ్చి.. పెద్ద మనుషుల ఆత్మగౌరవాన్ని నిలబెడుతున్నది తెలంగాణ ప్రభుత్వం కాదా? కాంగ్రెస్ హయాంలో సంవత్సరానికి రూ.800కోట్లు పెన్షన్లకు ఖర్చు చేస్తే.. తెలంగాణ ప్రభుత్వంలో 46లక్షల మందికి సంవత్సరానికి రూ.12వేలకోట్లు ఖర్చు చేస్తున్నాం. మేము చెప్పేదైతే కాంగ్రెస్ నాయకులు లెక్కలతో వస్తే లక్ష్మారెడ్డి చర్చలకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.ఏ రంగంలో చర్చకు వస్తరో రండి. మీరు చేసి ఉద్ధారకమేంది. మేం చెడగొట్టిందేది. మేము అన్నీ బాగుచేశాం. కానీ ఇవాళ నోటికి వచ్చిన బూతులు మాట్లాడుతున్నరు. జడ్చర్లలో కాంగ్రెస్ అభివృద్ధి కనిపిస్తలేదా అని నిలదీసారు. జడ్చర్లను గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా చేసేందుకు త్వరలోనే ఆదేశాలిస్తాం. ఎమ్మెల్యే కోరిక మేరకు రూ.30కోట్ల నిధులు త్వరలోనే విడుదల చేస్తాం. సీఎం కేసీఆర్ రాక ముందు చెరువు, సాగునీరును ఎవరూ పట్టించుకోలేదు. రైతాంగం కరెంటు రాక ఆకాశం వైపు చూసుకుంటే ఉండే పరిస్థితుల్లో.. అప్పులపాలై సచ్చిపోయినా ఎవరూ పట్టించుకోలే. కేసీఆర్ వచ్చాక ముఖ్యమంత్రి, ఏ ప్రధానమంత్రి చేయని ఆలోచన చేశారు. వానాకాలం నాట్లు వేసే టైమ్ వచ్చిందంటే రైతుబంధు మీ ఖాతాల్లో పడుతోందన్నారు. ఎకరం పొలం ఉంటే రూ.10వేలు వస్తున్న మాట వాస్తవం కాదా? ఒక్క జడ్చర్ల నియోజకవర్గంలోనే రైతుబంధు కింద 88,591 మంది రైతులకు ఇప్పటికీ రూ.900కోట్లకుపైగా ఖాతాల్లో జమ చేశాం' అని కెటిఆర్ తెలిపారు. రైతులను నేను అడుగుతున్నా ఎవరైనా కాంగ్రెసోళ్లు అరపైసా ఇచ్చారా? పంట పెట్టుబడి కింద అరపైస పంట సాయం చేసిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఉన్నారా ఈ దేశంలో అని అన్నారు. మరి వాళ్లు అధికారంలో ఉన్న నాడు ఎందుకు ఆలోచన చేయలేదన్నారు.. ముఖ్యమంత్రి కేసీఆర్ మనసున్న నాయకుడు, దిల్ ఉన్న నాయకుడు కాబట్టే.. ఏ రైతు కుటుంబం రోడ్డున పడకూడదని రూ.5లక్షల రైతు బీమా అమలు చేస్తున్నరు. జడ్చర్లలో రైతుబీమా కింద 1430 కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబం ఖాతాలో రూ.5లక్షలు జమ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం. దేశంలో నాలుగైదు చోట్ల కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. ఎక్కడైనా రైతుబీమా, రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్ సంస్కారం ఉన్నదా? మీరు వచ్చి మాపై మాట్లాడుతారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులకు రిజర్వేషన్‌ను 6 నుంచి 10శాతానికి పెంచామని, పోడు భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తున్నామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్న 50 సంవత్సరాల్లో రాష్ట్రంలో సక్రమంగా పని చేస్తే ఈ సమస్యలెందుకుంటయని,. ఈ యాత్రలెందుకంటూ ఆ పార్టీ నేతలపై మంత్రి ధ్వజమెత్తారు. మిషన్ కాకతీయలో బాగు చేసుకున్న చెరువులకాడ నిండిన నీళ్లను చూస్తూ పండగ చేసుకున్నాం. జడ్చర్లలో లక్ష్మారెడ్డి నాయకత్వం 560 డబుల్ బెడ్రూం ఇండ్లను పేదలకు అందించే కార్యక్రమాలను మృగశిర కార్తె నాడు చేసుకున్నందుకు ఆనందంగా ఉంది. మహబూబ్‌నగర్‌కు హెలికాప్టర్‌లో వస్తూ పైనుంచి చూస్తుంటే ఎర్రటి ఎండాకాలంలో నిండుకుండల్లా మారి.. మత్తళ్లు దుంకుతున్నయ్. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హెలికాప్టర్ నుంచి ఉద్దండాపూర్, కరివెన ప్రాజెక్టులను చూపించారు. ఈ ప్రాజెక్టులు నిండితే 1.44లక్షల ఎకరాలకు నీళ్లు రాబోతున్నాయి మీతో సంతోషాన్ని మీతో పంచుకుంటున్నారు. ఒకసారి కృష్ణా నీరు జడ్చర్లకు వస్తే దశాబ్దాల పాలమూరు గోస, పీడపోతుంది.. నా జన్మ ధన్యమవుతుందని రైతుల సంతోషాన్ని మీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాతో పంచుకున్నారు' అని కేటీఆర్ తెలిపారు. మిడ్జిల్‌లో చెక్‌డ్యామ్‌లు కడితే 5వేల ఎకరాలకు నీళ్లు వచ్చాయి. నియోజకవర్గంలో 628 చెరువులుంటే రూ.80కోట్లతో 371 చెరువులకు మరమ్మతులు చేశాం. వాటితో గంగపుత్రులు, ముదిరాజ్‌లకు, రైతులకు లాభం జరిగిందని చెరువుల పండుగ సందర్భంగా లక్ష్మారెడ్డి సంతోషంతో చెబుతున్నారు. తొమ్మిదేళ్లు నిండి పదేళ్లలో అడుగుపెడుతున్న తెలంగాణలో కొంత సంతోషకరమైన వాతావరణంలో పండగ చేసుకునే ప్రయత్నంలో మనమున్నాం. 15రోజుల కిందట కాంగ్రెస్ నేతలు పాదయాత్ర చేసుకుంటూ ఇక్కడకు వచ్చారు. వచ్చి మంచి మనిషి లక్ష్మారెడ్డిని నోటికి వచ్చినట్టు తింటిపోయిండు. కాంగ్రెస్ అధ్యక్షుడికి నోటిదూల ఎక్కువ అని మండిపడ్డారు. ఇది వరకు వచ్చిపోతే తిట్టిపోతే 45వేల మెజారిటీతో లక్ష్మారెడ్డిని మీరు గత ఎన్నికల్లో గెలిపించారు. ఈ సారి లక్ష్మారెడ్డిని 90వేలకుపైగా ఓట్ల మెజారిటీతో గెలిపించి ఆ సన్నాసులకు సమాధానం చెప్పాలన్నారు. మహబూబ్‌నగర్‌లో 14 రోజులకొకసారి తాగునీరు వచ్చేది. జడ్చర్లలో పరిస్థితులు ఎలా ఉండేవో మీకే తెలుసు. ఎండకాలం వచ్చిందంటే ఎమ్మెల్యేలు, సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలకు భయపడుతుంటే. ఏ ఊరికి వెళ్తే బిందెలు అడ్డం పెడుతరో.. బోర్లు అడుగుతరో భయపడే పరిస్థితులు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితులు ఉన్నాయా? మిషన్ భగీరథతో కడుపునిండా నీళ్లు వస్తున్న మాట వాస్తవం అయితే గట్టిగా చప్పట్లతో ముఖ్యమంత్రికి ధన్యవాదాలు చెప్పాలి' అనగా.. సభా ప్రాంగణమంతా చప్పట్లతో దద్దరిల్లింది. రంగారెడ్డి పథకాన్ని కాంగ్రెస్ పట్టించుకోకపోతే తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఎన్ని కేసులు పెట్టినా, కోర్టులతో అడ్డుకునే ప్రయత్నం చేసినా బీజేపోళ్లు కృష్ణా జలాలు పంచకపోయినా వాయువేగంతో పూర్తి చేసుకుంటూ ఆగస్ట్, సెప్టెంబర్ నాటికి కరివెన, ఆ తర్వాత రెండు మూడు నెలలకు ఉద్దండాపూర్ నిండి జడ్చర్ల నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుంది' అని ప్రకటించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దూరదర్శన్ తొలి యాంకర్ గీతాంజలి అయ్యర్ మృతి



(మొదటి పేజీ తరువాయి) సహాయక సిబ్బంది ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు తెలిపారు. గీతాంజలి దూరదర్శన్‌లో 1971 నుంచి 30 ఏళ్ల పాటు యాంకర్‌గా పని చేశారు. దూరదర్శన్ స్వర్ణయుగ కాలంలో ఆమె ప్రముఖ యాంకర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. నాలుగుసార్లు ఉత్తమ యాంకర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఇందిరాగాంధీ ప్రియదర్శని అవార్డును కూడా గెలుచుకున్నారు. గీతాంజలికు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న ఈ ఇద్దరూ వచ్చాక గీతాంజలి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆమె సన్నిహితురాలు సుమిత మెహతా తెలిపారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ అరికట్టండి

(మొదటి పేజీ తరువాయి) నియంత్రణ చట్టంను అమలు చేయాలంటూ బిజెవైఎం నాయకులు ఆందోళనకు దిగారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు రావడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సమయంలో ఉద్రిక్తత నెలకొంది. ఆ తర్వాత నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. అధిక ఫీజుల వసూళ్లను అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చట్టం ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం కాకుండా పాఠశాలలో మెరుగైన మౌలిక, ఆధునిక వసతులు కల్పిస్తూ, విద్యా శాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలి. కే పేరుతో అక్రమంగా నడుస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలను నిషేధించాలని బిజెవైఎం డిమాండ్ చేసింది.

# నాడు ఎండిన చెరువులు

## నేడు నిండిన జలాశయాలు: హరీష్



హైదరాబాద్,జూన్8 (సమ సమాజం): నాటి పాలకుల నిర్లక్ష్యంతో గొలుసుకట్టు వ్యవస్థ చిన్నాభిన్నమైందని మంత్రి హరీశ్ రావు అన్నారు. నేడు సీఎం కేసీఆర్ చేపట్టిన మిషన్ కాకతీయతో చెరువులు పునరుజ్జీవం సంతరించుకున్నాయని చెప్పారు. అందుకే మన మిషన్ కాకతీయ దేశానికే ఆదర్శం అయిందని తెలిపారు. మిషన్ అమృత్ సరోవర్ పేరుతో మిషన్ కాకతీయను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని ట్వీట్ చేశారు. నాడు ఎండి పోయిన చెరువులు.. నేడు నిండు కుండల్లా చెరువులు.. నాటి పాలకుల నిర్లక్ష్యంతో గొలుసుకట్టు వ్యవస్థ చిన్నాభిన్నం.. నేడు సీఎం కేసీఆర్ చేపట్టిన మిషన్ కాకతీయతో చెరువుల పునర్జీవం. అందుకే మన మిషన్ కాకతీయ దేశానికే ఆదర్శం అయ్యింది. అమృత్ సరోవర్‌గా దేశ వ్యాప్తంగా అమలవుతోంది.

# ఎట్టకేలకు రుతుపవనాల రాక



(మొదటి పేజీ తరువాయి) నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ఆవర్తనం బలహీనపడిందని పేర్కొన్నది. రాగల మూడు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు, బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు తారెత్తించాయి. ఉత్తర చత్తీస్‌ఘడ్ నుంచి తెలంగాణ మీదుగా ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక వరకు ఉన్న ద్రోణి ఈ రోజు బలహీన పడింది. దిగువ స్థాయిలోని గాలులు ముఖ్యంగా వాయువ్య, పశ్చిమ దిశల నుంచి తెలంగాణ రాష్ట్రం వైపుకి వీస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశించాయి. రాగల 48 గంటల్లో కేరళ అంతటా.. తమిళనాడు, కర్ణాటకలోని కొన్ని భాగాలకు ప్రవేశించే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో రెండ్రోజులపాటు కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది.రాష్ట్రంలో ఉరుములు , మెరుపులు, ఈదురు గాలులుతో కూడిన వర్షాలు అక్కడక్కడ వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలో వడగాలులు అక్కడక్కడ వీచే అవకాశం ఉంది. ముఖ్యంగా ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట , కొత్తగూడెం, అదిలాబాద్, కొమరం భీం , మంచిర్యాల్, నిర్మల్ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

## నేడు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేపమందు పంపిణీ



(మొదటి పేజీ తరువాయి) ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసిన్నట్లు వెల్లడించారు. చేప ప్రసాదం కోసం రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది వస్తుంటారని చెప్పారు. సాధారణ ప్రజలు, వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలకు వేరు వేరుగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి చేప ప్రసాదం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు.

## భాస్కర్‌రెడ్డి బెయిల్ పిటిషన్ పై కౌంటర్



(మొదటి పేజీ తరువాయి) పోస్టుమార్టం వద్దని సీఐ శంకరయ్యకు అవినాష్, శివశంకర్ రెడ్డి చెప్పారని వివరించారు. సీబీఐకి, కోర్టుకు ఏమీ చెప్పొద్దని దస్తగిరిని ప్రలోభపెట్టే ప్రయత్నం చేశారన్నారు. దస్తగిరిని ప్రలోభపెట్టేందుకు అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శివశంకర్‌రెడ్డి అనేక ప్రయత్నాలు చేశారని సీబీఐ అధికారులు కౌంటర్‌లో పేర్కొన్నారు. భాస్కర్‌రెడ్డికి బెయిల్ ఇస్తే దర్యాప్తును, కీలక సాక్షులను ప్రభావితం చేస్తారని సీబీఐ అధికారులు అన్నారు. కడప, పులివెందుల ప్రాంతాల్లో భాస్కర్‌రెడ్డి చాలా ప్రభావితం చేయగల వ్యక్తి అని, అరెస్టు చేసినప్పుడు కడపలో జరిగిన ధర్నాలు, ప్రదర్శనలే భాస్కర్‌రెడ్డి బలానికి నిదర్శనమన్నారు. భాస్కర్‌రెడ్డి బయట ఉంటే చాలు.. పులివెందుల సాక్షుల ప్రభావితమైనట్లేనని అధికారులు పేర్కొన్నారు. భాస్కర్‌రెడ్డికి బెయిల్ ఇస్తే ఎన్ని షరతులు పెట్టినా నిరుపయోగమేనన్నారు. సాక్షులను, ఆధారాలను ప్రభావితం చేస్తే కేసుకు పూడ్చలేని నష్టం జరుగుతుందని, దర్యాప్తునకు సహకరించానని భాస్కర్‌రెడ్డి చెప్పడం అబద్ధమని అన్నారు. కడప ఎస్పీ సమాచారం మేరకు భాస్కర్‌రెడ్డిపై గతంలో మూడు కేసులున్నాయని, పేలుడు పదార్థాల చట్టం సహా మూడు కేసులు గతంలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారన్నారు. రెండు కేసులు వీగిపోగా.. మరొకటి తప్పుడు కేసుగా తేల్చి కొట్టివేశారని, కేసుల ప్రకారం భాస్కర్‌రెడ్డి నేపథ్యం ప్రశ్నార్థకంగా కనిపిస్తోందన్నారు. వివేకా హత్యలో ప్రమేయాన్ని చూసినా.. భాస్కర్‌రెడ్డి నేపథ్యం ప్రశ్నార్థకమేనన్నారు. ఏప్రిల్ 16 నుంచి జైల్లో ఉన్నంత మాత్రాన బెయిల్‌కు కారణం కారాదన్నారు. వివేకా హత్య విషయం సీఎం జగన్‌కు ఆరోజు ఉదయం 6.15 గంటలకు ముందే తెలుసునని, వివేకా పీఏ బయటకు చెప్పకముందే జగన్‌కు తెలుసని దర్యాప్తులో గుర్తించినట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. మరోవైపు వైఎస్ భాస్కర్‌రెడ్డికి బెయిల్ ఇవ్వొద్దని వివేకా కుమార్తె సునీత కోరుతూ.. సీబీఐ కోర్టులో లిఖితపూర్వక వాదనలు సమర్పించారు. వివేకా హత్య కేసు లోతుగా దర్యాప్తు జరగాల్సి ఉందని, భాస్కర్‌రెడ్డికి బెయిల్ ఇస్తే సాక్షులను, దర్యాప్తును ప్రభావితం చేస్తారన్నారు. భాస్కర్‌రెడ్డి ప్రమేయంపై పలువురు సాక్షుల వాంగ్మూలాలను సునీత ప్రస్తావించారు.

## పాలమూరు అంటే ఒకప్పుడు మైగ్రేషన్



(మొదటి పేజీ తరువాయి) విషయమన్నారు. పరిశ్రమల కల్పనకు ఆ రోజుల్లో రెడ్ టేప్ ఉంటే.. నేడు రెడ్ కార్పొరేట్ పరుస్తున్నామని తెలిపారు. నైపుణ్యాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్ మనదేనన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని, ఉపాధి అవకాశాలు అంతేలా ఉంటాయన్నారు. అందరూ స్కిల్ సంపాదించాలని సూచించారు. గతంలో పారిశ్రామికవేత్తలు ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేసిన దుస్థితి వాస్తవం కాదా? అని గుర్తు చేసిన కేటీఆర్.. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందని ప్రశ్నించారు. ఒకప్పుడు మహబూబ్ నగర్ అంటే మైగ్రేషన్ అని, ఇప్పుడు మహబూబ్‌నగర్ అంటే ఇరిగేషన్‌గా తయారైందన్నారు. హైదరాబాద్ మారింది వాస్తవం కాదా అన్నారు. 24 గంటల కరెంటు ఉండడం వాస్తవం కాదా..? ఈ తొమ్మిదేళ్లలో ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చాం..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ రావడం.. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 30శాతంగా ఉన్న ప్రసూతి.. ఇప్పుడు 60శాతానికి వచ్చిన మాట వాస్తవం కాదా? అన్నారు. రియల్ ఎస్టేట్ అప్పుడు ఎంత ఉంది? ఇప్పుడు ఎకరా ఎంత ఉందో తెల్వదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం కేవలం స్కిల్ డెవలప్‌మెంట్‌పైనే దృష్టి సారించాలని కేటీఆర్ సూచించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసగౌడ్ కూడా పాల్గొన్నారు.

## 1000నోటు రాదు.. 500 నోటు పోదు..



(మొదటి పేజీ తరువాయి) రూపాయలు మాత్రమే అని.. అదే కంటిన్యూ అవుతుందని.. దాన్ని వెనక్కి తీసుకునే ఆలోచన అస్సలు చేయటం లేదని వెల్లడించారు. ఇకపోతే రెండువేల నోటు రద్దుతోరూ. 2 వేల నోట్లు బ్యాంకులకు క్యూ కట్టాయి. 2 వేల నోట్లను ఆర్బీఐ ఉపసంహరించుకున్న తర్వాత దేశంలోని బ్యాంకుల్లో ప్రజలు రూ. 2వేల నోట్లను జమ చేసేందుకు పోటెత్తారు. ఇప్పటివరకు దేశంలో సర్క్యులేషన్ లో ఉన్న రూ. 2 వేల నోట్లలో 35 శాతం తిరిగా బ్యాంకులకు వచ్చేశాయని ఆర్బీఐ ప్రకటించింది. రిజర్వ్ బ్యాంకు మే 19వ తేదీన రూ. 2 వేల నోట్లను ఉపసంహరించుకుంది. ప్రజలు తమ వద్ద ఉన్న రూ. 2 వేల నోట్లను మే 23 నుంచి సెప్టెంబర్ 30 వరకు బ్యాంకుల్లో మార్చుకోవచ్చని తెలిపింది. దాంతో ప్రజలు తమ వద్ద ఉన్న రూ. 2 వేల నోట్లను బ్యాంకుల్లో జమ చేయడం, మార్చుకోవడం ప్రారంభించారు. దీంతో ఇప్పటి వరకు 35శాతం రూ. 2 వేల నోట్లు బ్యాంకుల్లో జమ అయ్యాయని తెలుస్తోంది. మార్చి 31 నాటికి దేశంలో 2 వేల రూపాయల నోట్లు సుమారు 181 కోట్లు ఉన్నాయి. వీటి విలువ సుమారు 3.62 లక్షల కోట్లు. వాటిలో ఇప్పటివరకు 35 శాతం నోట్లు తిరిగి బ్యాంకుల్లో జమ అయ్యాయి. 2016లో ఆర్బీఐ రూ. 2000 నోటును చలామణిలోకి తీసుకువచ్చింది. 2016 నవంబర్ 8న అప్పటివరకు చెలామణిలో ఉన్న రూ. 1000, రూ. 500 నోట్లను రద్దు చేసింది. నగదుకు కొరత రాకుండా ఉండేందుకు రూ. 2 వేల నోట్లను ప్రవేశపెట్టింది. మిగతా డినామినేషన్లలో నగదు అవసరమైనంత మేరకు వ్యవస్థలో అందుబాటులోకి వచ్చిన తరువాత క్రమంగా రూ. 2 వేల నోట్లను తగ్గించింది. ఇక 2019 నుంచి ఆర్బీఐ రూ. 2 వేల నోట్లను ముద్రించడం కూడా ఆపేసింది.

## మృగశిరకార్తి ప్రవేశంతో తొలకరి

(మొదటి పేజీ తరువాయి) తొలకరి జల్లులు పడగానే దుక్కి దున్ని పంటలు వేసేందుకు సిద్ధమవుతారు. ఏరువాకసాగే కాలం అని కూడా అంటారు.మృగశిర నక్షత్రం దేవగణానికి చెందినది. అధిపతి కుజుడు. రాశి అధిపతులు శుక్రుడు, బుధుడు. ఈ నక్షత్రంలో జన్మించినవారు మంచి అదృష్టం కలిగివుంటారు. సూర్యుడు ఒక్కొక్క నక్షత్రంలో 14 రోజుల పాటు ఉంటాడు. సూర్యుడు ఏ నక్షత్రానికి సమీపంలో ఉంటే ఆ కాలానికి (కార్తె) ఆ నక్షత్రం పేరు పెడుతారు. సౌరమానం ప్రకారం లెక్కించబడటంతో ఈ కార్తెలు ఆంగ్ల గ్రెగొరియన్ క్యాలెండర్ ప్రకారం దాదాపు ప్రతి సంవత్సరం ఒకే తేదిల్లో వస్తాయి. పురాణగాధ ప్రకారం మృగశిరస్సు కలిగిన మృగవ్యాధుడు అను వృతాసురుడు వరప్రభావంచే పశువులను, పంటలను హరించి వేయడం ప్రకృతి భీభత్సాలాను సృష్టించడం, వర్షాలకు అడ్డుపడటం జరుగుతూ ఉండేడిది. ఇతను చనిపోకుండా అనేక వరాలు కలిగి ఉండటంచేత ఇంద్రుడు సముద్ర హలల నుండి వచ్చే నురుగును ఆయుధంగా చేసి చంపేస్తాడు.ఈ కథ ఆధారంగా ఖగోళంలో ఇంద్ర నక్షత్రమైన జ్యేష్టాకు మృగశిరకు 180 డిగ్రీల దూరంలో ఉండటం వలన తూర్పు ఆకాశంలో ఇంద్ర నక్షత్రం ఉదయించగానే వృతాసుర నక్షత్రం అస్తమిస్తుంటుంది. ఇక్కడ నురుగు అనేది ఋతుపవనాలకు, వర్షాలకు సూచన. ఇంద్ర నక్షత్రమైన జ్యేష్ట ఉదయించినపుడు సూర్యుడు మృగశిరలోకి ప్రవేశించడం వలన మృగశిరకార్తె ప్రవేశిస్తుంది. వర్షాలు పడకుండా అడ్డుపడ్డ మృగాసురుని చంపిన ఇంద్రుడ్ని వర్షప్రదాతగా, వర్షదేవుడుగా పిలుస్తారు. ఇది కథ.ప్రస్తుతం ఈ కార్తె ప్రవేశానికి ముందు తీవ్రమైన ఎండలతో భూమి అంతా వేడెక్కి మానవ శరీరాలు తాపంతో ఉంటాయి. జూన్ మొదటి వారంలో అంటే సుమారుగా 8తేదీ నుండి ప్రకృతి పరంగా వర్షాలు పడడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వాతావరణంలో తీవ్రమైన ఎండల నుండి వర్షాల వలన వాతావరణం చల్లబడడంతో మానవుల శరీరంలో కూడా ప్రకృతి మార్పు ప్రభావం పడుతుంది.శరీరం ప్రకృతి యొక్క మార్పును తట్టుకోవడానికి ఈ రోజు ఇంగువబెల్లం తింటారు.మాంసాహారం తీసుకునే వారు చేపలను తింటారు. శాఖాహరులు మాత్రం ఇంగువను బెల్లంలో కలిపి గుండ్రని గోళిలాగ చేసి దేవుని దగ్గర పెట్టి దండం పెట్టుకుని కుటుంబ సభ్యులందరు అన్ని వయస్సులవారు తప్పక తింటారు.ఈ అయుర్వేద పక్రియ వలన శరీరం బలంగా ఉంచుతూ, రోగనిరోధక శక్తిని ప్రసాదిస్తుంది.



## మిషన్ కాకతీయతో చెరువులకు జలకళ

### చెరువుల పండుగలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి



వరంగల్,జూన్8 (సమ సమాజం): మిషన్ కాకతీయతో రాష్ట్రంలోని చెరువులకు పూర్వవైభవం వచ్చిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం సోమరం, గుర్తూరు చెరువుల వద్ద నిర్వహించిన చెరువుల పండుగలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పాలనలో తెలంగాణలోని నీటి వనరులను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత, సీఎం కేసీఆర్ నేతృత్వంలో మిషన్ కాకతీయ ద్వారా ఐదువేల కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలోని 46వేల చెరువులను పునరుద్ధరించడం ద్వారా పూర్వవైభవం తీసుకొచ్చారని వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రూ. 179 కోట్ల ఖర్చుతో 601 చెరువులను, పాలకుర్తి నియోజకవర్గం లో రూ.61 కోట్లతో 331 చెరువులను బాగు చేసినట్లు వివరించారు. దీనివల్ల 119 శాతం భూగర్భ జలాలు పెరిగాయని అన్నారు. చెరువుల కింద 150 శాతం పంటల సాగుబడి, దిగుబడి పెరిగిందని వివరించారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే కాకుండా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును రికార్డ్ టైంలో పూర్తిచేసి కోటి ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. కాళేశ్వరం , దేవాదుల, ఎస్సారెస్పీ నీటి ద్వారా ఆఖరి ఆయకట్టుకు సంబంధించిన చెరువులను కూడా నీటితో నింపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. చెరువులను బలోపేతం చేయడంతో పాటు చెరువులను నీటితో నింపడం వల్ల మత్స్యకారులకు ప్రభుత్వం ఉపాధి కల్పించిందని మంత్రి అన్నారు. ప్రభుత్వమే ఉచితంగా చేపపిల్లలను అందిస్తూ వారిని ఆదుకుంటుందని పేర్కొన్నారు. స్థానికులకు ఆరోగ్యకర చేపలు లభిస్తున్నాయని వెల్లడించారు. చెరువుల పండుగ సందర్భంగా కట్టమైసమ్మలకు, గంగమ్మ తల్లికి పూజలు చేశారు. గ్రామ చెరువుల్లో జాలరులతో కలిసి మంత్రి చేపలు పట్టారు.

## పాలమూరు పర్యటనలో మంత్రులు



పలు అభివృద్ధి పనులకు కెటిఆర్ శంకుస్థాపన

మహబూబ్‌నగర్,జూన్8 (సమ సమాజం): మహబూబ్‌నగర్ జిల్లాలో మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. ఇందులో భాగంగా మూసాపేట మండలం వేములకు చేరకున్న మంత్రి కేటీఆర్.. ఎస్‌జీడీ ఫార్మా కార్నింగ్ టెక్నాలజీ ఎ÷-లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మైక్రో రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు దేవరకద్ర నియోజకవర్గంలోని భూత్పూర్‌లో (మున్సిపల్ పార్కు, ఓపెన్ జిమ్‌లను ప్రారంభించారు.అంతకుముందు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో భూత్పూర్ చేరుకున్న మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డికి మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, గువ్వల బాలరాజు ఘనంగా స్వాగతం పలికారు.నంతరం ముసాపేట మండలం వేములలోని ప్రైవేటు కంపెనీ యూనిట్‌కు, మైక్రో రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మణానికి, మహబూబ్‌నగర్‌లోని బాలికల ఐటీఐలో శంకుస్థాపన చేసారు. తర్వాత అక్కడే ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు జడ్చర్లలోని ఎర్రగుట్టలో డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించి, లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేస్తారు.

## రాష్ట్రంలోని జల వనరులకు జలకళ

### చెరువుల పండుగ కార్యక్రమంలో మంత్రి కొప్పుల

జగిత్యాల,జూన్8 (సమ సమాజం): తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ ద్వారా రాష్ట్రంలోని జల వనరులన్నీ జలకళతో కళకళలాడుతున్నాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి మండలం ధమ్మన్నపేట, బుద్దేశపల్లి, బుగ్గారం మండలం వెల్గొండ, గోపులపూర్ గ్రామాల్లో నిర్వహించిన చెరువుల పండుగ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు . ఈ సందర్భంగా గ్రామాల్లో కట్ట మైసమ్మకు బోనాలను సమర్పించి సహపంక్తి భోజనాలు చేశారు.మంత్రి మాట్లాడుతూ ..మిషన్ కాకతీయద్వారా చేపట్టిన చెరువుల పునరుద్ధరణతో మండుటెండల్లో సైతం చెరువులు మత్తడులు దూకుతున్నాయని పేర్కొన్నారు.నీటి పారుదల రంగంలో రాష్ట్రం అద్భుత ప్రగతిని సాధించిందని పేర్కొన్నారు. నీటి పారుదల రంగంలో చేపట్టిన కార్యక్రమాల ద్వారా చెరువులకు పునర్జీవం వచ్చిందని, దీంతో సాగు నీటి సమస్యను అధిగమించామని చెప్పారు. రికార్డు స్థాయిలో పంటలు పండుతున్నాయని అన్నా. చెరువులపై ఆధారపడ్డ మత్స్యకారులు, చెరువు కట్టపై ఈత చెట్లు నాటడం వల్ల గీత కార్మికుల ఆదాయం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాల్లో 12న తెలంగాణ రన్

### విజయవంతం చేయాలని సిఎస్ ఆదేశం



హైదరాబాద్,జూన్8 (సమ సమాజం): తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 12 వ తేదీన నిర్వహించే తెలంగాణ రన్ లో పెద్ద ఎత్తున పాల్గని విజయవంతంచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కోరారు. తెలంగాణ రన్ నిర్వహణపై గురువారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ హైదరాబాద్ లోని బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలోని మైదానం నుంచి జరిగే 2 కె, 4 కె రన్ లను ప్రధానంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ రన్‌లో కనీసం నాలుగు వేల మంది రన్నర్లు పాల్గంటారని వివరించారు. నగరంలోని యువత, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ సంస్థల ప్రతినిధులు, పోలీసులు పాల్గంటారని వెల్లడించారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ స్ఫూర్తిని ప్రతిబింబించేలా రన్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జీఏడీ కార్యదర్శి శేషాద్రి, ఎస్సీ అభివఅద్ధి శాఖ కార్యదర్శి రాహుల్ బజ్జా, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, అడిషనల్ డీజీ సంజరు కుమార్ జైన్, ఐజీ రమేష్ రెడ్డి, అడిషనల్ సీపీ లు విక్రమ్ సింగ్ మాన్, సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### రసమయికి దళితుల నిరసన

కరీంనగర్,జూన్8 (సమ సమాజం): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతరంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పర్యటించారు. స్థానిక ఎస్సీ కాలనీకి రాగానే ఆయనకు దళితుల నుంచి నిరసన సెగ తగిలింది. స్థానికులు ఆయన పర్యటనను అడ్డుకున్నారు. ఇళ్లు లేక తాము రోడ్లపై నివసిస్తున్నామని, ప్రభుత్వం ఇస్తామన్న డబుల్?బెడ్రూం ఇళ్లు ఏవని ఎమ్మెల్యేను నిలదీశారు. ఈ క్రమంలో నిరసనకారులకు ఎమ్మెల్యే అనుచరులకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. అనుచరులు నిరసనలు తెలపకుండా దళితులను అడ్డుకుని తోసేశారు. ఈ పరిణామాలపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డబల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# స్టార్‌బ్యాట్స్‌మెన్ స్టీవ్ స్మిత్ సెంచరీ



ఓవల్,జూన్8(సమ సమాజం): భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ రెండవ రోజు ఆట మొదలైంది. ఓవర్ నైట్ స్కోరు 327/3 వద్ద ఆసీస్ బ్యాటింగ్ ఆరంభించింది. ఓవర్ నైట్ స్కోరు 95 పరుగులతో క్రీజులో అడుగుపెట్టిన స్టార్‌బ్యాట్స్‌మెన్ స్టీవ్ స్మిత్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ సెంచరీతో పలు రికార్డులను సొంతం చేసుకున్నాడు. కెరీర్‌లో 31వ టెస్ట్ శతకాన్ని నమోదు చేశాడు. ఈ సెంచరీతో ఇండియాపై అత్యధిక టెస్ట్ సెంచరీలు చేసిన విదేశీ ఆటగాళ్ల జాబితాలో జో రూట్ సరసన స్మిత్ చేరాడు. జో రూట్, స్మిత్ భారత్‌పై చెరో 9 టెస్ట్ సెంచరీలు కొట్టారు. ఇక ఇంగ్లండ్‌లో పర్యటక ఆటగాడిగా స్మిత్‌కు ఇది 7వ సెంచరీగా ఉంది. మరోవైపు ఓవర్ నైట్ స్కోరు 146 పరుగులతో క్రీజులోకి దిగిన ట్రావిడ్ హెడ్ 163 పరుగులు చేశాక ఔటయ్యాడు. సిరాజ్ బౌలింగ్‌లో కీపర్ భరత్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కామెరూన్ గ్రీన్ క్రీజులోకి అడుగుపెట్టాడు. అయితే స్వల్ప స్కోరు 6 పరుగులకే మహ్మద్ షమీ బౌలింగ్‌లో శుభ్‌మన్ గిల్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. దీంతో రెండో రోజు ఆరంభంలోనే 2 వికెట్లు పడినట్టయ్యింది. కాగా ప్రస్తుతం 93 ఓవర్లు ముగిసేసరికి జట్టు స్కోరు 368/5గా ఉంది.

# రెండో సెషన్‌లో రవీంద్ర జడేజా మాయ

## 8 వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియా




ఓవల్,జూన్8(సమ సమాజం): ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రెండో రోజు ఆస్ట్రేలియా ఆలౌట్ ప్రమాదంలో పడింది. రెండో సెషన్‌లో రవీంద్ర జడేజా తన మొదటి ఓవర్‌లోనే అలెక్స్ క్యారీ (48)ని ఔట్ చేశాడు. మూడో బంతికి సిక్స్ కొట్టిన అతను తర్వాత రివర్స్ స్వీప్ షాట్ ఆడి ఎల్బీగా వెనుదిరిగాడు. అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో భారత్ రివ్యూ తీసుకుని వికెట్ సాధించింది. దాంతో, 51 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. నాథన్ లియాన్, కెప్టెన్ ప్యాట్ కమిన్స్(8) క్రీజులో ఉన్నారు.మిచెల్ స్టార్క్ ఔటయ్యాక క్యారీ, కమిన్స్ జాగ్రత్తగా ఆడి స్కోర్ 450 దాటించారు. 115.2 ఓవర్లకు ఆసీస్ స్కోర్.. 454/8. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ÷నైల్ రెండో రోజు భారత బౌలర్లు జోరు కొనసాగించారు. తొలి సెషన్‌లో కీలకమైన మూడు వికెట్లు పడగొట్టారు. దాంతో, ఆస్ట్రేలియాలో లంచ్ బ్రేక్ సమయానికి 7 వికెట్ల నష్టానికి 422 రన్స్ కొట్టింది. కీపర్ అలెక్స్ క్యారీ (22), కెప్టెన్ ప్యాట్ కమిన్స్(2) క్రీజులో ఉన్నారు. మిచెల్ స్టార్క్ ఔటయ్యాక వీళ్లు జాగ్రత్తగా ఆడి స్కోర్ 400 దాటించారు. ఓవర్ నైట్ స్కోర్ 95తో రెండో రోజు క్రీజులోకి వచ్చిన స్టీవ్ స్మిత్(121) సెంచరీ సాధించాడు. సిరాజ్ ఓవర్లో రెండు ఫోర్లు బాది వందకు చేరువయ్యాడు.మరోవైపు దూకుడు పెంచిన ట్రావిస్ హెడ్(163) డబుల్ సెంచరీ దిశగా వెళ్తున్నాడు. ప్రమాదకరమైన ఈ జోడీని సిరాజ్ విడదీశాడు. హెడ్‌ను ఔట్ చేసి టీమిండియాకు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత షమీ అద్భుత బంతితో ఐపీఎల్ సెంచరీ హీరో కామెరూన్ గ్రీన్(6)ను పెవిలియన్ పంపాడు. సెంచరీ కొట్టిన స్టీవ్ స్మిత్(121)ను లార్డ్స్ శార్దూల్ బౌల్డ్ చేశాడు. రెండో సెషన్‌లో తన తొలి ఓవర్‌లోనే అతను స్మిత్‌ను వెనక్కి పంపాడు. ఆ తర్వాత వచ్చిన కీపర్ అలెక్స్ క్యారీ (8), మిచెల్ స్టార్క్(0)తో ఇన్నింగ్స్ నిర్మించాలి అనుకున్నాడు. కానీ, సిరాజ్ ఓవర్లో అక్షర్ పటేల్ ఒంటి చేత్తే విసిరిన త్రోకు స్టార్క్ రనౌటయ్యాడు. దాంతో, ఆసీస్ 7 వికెట్లు కోల్పోయింది.

# రిటైర్మెంట్ వెనక్కి తీసుకున్న మొయిన్ అలీ

లండన్,జూన్8(సమ సమాజం): రెండేళ్ల క్రితం టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన ఇంగ్లండ్ వెటరన్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు. దీంతో 35 ఏళ్ల అలీని ఈనెల 16 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే యాషెస్ టెస్టు సిరీస్ కోసం ఇంగ్లండ్ జట్టుకు ఎంపిక చేశారు. గాయపడ్డ స్పిన్నర్ జాక్ లీచ్ స్థానంలో అలీని జట్టులోకి తీసుకున్నట్టు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు బుధవారం ప్రకటించింది. ఇక, రిటైర్మెంట్ వెనక్కి తీసుకునే విషయంలో అలీని కెప్టెన్ బెన్ స్టోక్స్, కోచ్ బ్రెండన్ మెకల్లమ్ ఒప్పించినట్టు సమాచారం.



# సెమీఫైనల్స్‌కు ఇగా స్వైటెక్



పారిస్,జూన్8(సమ సమాజం): వరల్డ్ నంబర్ వన్, టాప్ సీడ్ ఇగా స్వైటెక్ ఫ్రెంచ్ ఓపెన్ విమెన్స్ సింగిల్స్‌లో సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. టోర్నీలో ఇప్పటిదాకా ఒక్క సెట్ కూడా కోల్పోని స్వైటెక్ అదే జోరును కొనసాగిస్తూ క్వార్టర్స్‌లో అమెరికా టీనేజర్ కొకా గాఫ్ పని పట్టింది. బుధవారం ఏకపక్షంగా సాగిన పోరులో స్వైటెక్ (పోలాండ్) 6?4, 6?2తో ఆరో సీడ్ గాఫ్‌ను చిత్తు చేసింది. గాఫ్‌తో ముఖాముఖీ రికార్డును 7–0కు పెంచుకుంది. సెమీస్‌లో ఆమె బీట్రిజ్ హదాద్ పోటీ పడనుంది. మరో క్వార్టర్ ఫైనల్లో 14వ సీడ్ హదాద్ (బ్రెజిల్) 3–6, 7–6 (7/5), 6–1తో జబెర్ (ట్యునీసియా)కు షాకిచ్చి సెమీస్‌లో అడుగుపెట్టింది. మెన్స్ సింగిల్స్ క్వార్టర్స్‌లో జర్మనీ స్టార్ 22వ సీడ్ జ్వెరెవ్ 6–4, 3–6, 6–3, 6–4తో యిచెవర్ (అ÷–జ్గ÷ంటీనా)ను ఓడించి సెమీస్ చేరాడు.

---




# అడవుల్లో నుంచి పట్టణంలోకి

## చురుకుగా పుష్ప-2 షూటింగ్

దర్శకుడు సుకుమార్, అల్లు అర్జున్ కాంబినేషన్ లో వస్తున్న 'పుష్ప 2' షూటింగ్ శరవేగంగా సాగుతున్నది. కొన్ని రోజుల క్రితం మారేడుమిల్లి అడవుల్లో ఈ సినిమా షూటింగ్ జరిగింది. తాజాగా షూటింగ్ స్పాట్‌ను రామోజీ ఫిలిమ్ సిటీకి తరలించారు. ఇక అక్కడ ఇండోర్‌లో షూటింగ్ జరుగనుంది. మలయాళం నటుడు ఫహాద్ ఫాజిల్ అడవిలో పుష్ప కోసం తన పోలీస్ ఫోర్స్‌తో వెతుకుతున్న సన్నివేశాలను చిత్రీకరించారని తెలిసింది. ఆ షూటింగ్‌లో అల్లు అర్జున్ పాల్గొనలేదు. ఇప్పుడు మళ్ళీ అడవి నుండి ఆ సినిమా షూటింగ్ స్టూడియోకి షిఫ్ట్ అయింది అని తెలిసింది. ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలో ఈ 'పుష్ప 2' సినిమా షూటింగ్ జరుగుతోందని తెలిసింది. ఈ సినిమాలో విలన్స్ అయిన అనసూయ ,సునీల్, రావు రమేష్, ఇంకా మిగతా వాళ్ళ మీద కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్టుగా తెలిసింది. ఆసక్తికరం ఏంటంటే, ఈ షూటింగ్‌లో కూడా అల్లు అర్జున్ పాల్గొనలేదని తెలిసింది. అల్లు అర్జున్ లేని సన్నివేశాలను దర్శకుడు సుకుమార్ ఇప్పుడు చిత్రీకరిస్తున్నట్టుగా తెలిసింది. ఇవి అయిపోగానే అల్లు అర్జున్ తో వుండే కాంబినేషన్ సన్నివేశాలు, పోరాట సన్నివేశాలు ఇవన్నీ చిత్రీకరించనున్నట్టు అప్పుడే రష్మిక కూడా షూటింగ్ లోకి ఎంటర్ అవుతున్నట్టుగా తెలిసింది. 'పుష్ప 2' కోసం ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. ఇది థియేటర్స్ లో ఒక చరిత్ర సృష్టిస్తుందని పరిశ్రమలో అనుకుంటున్నారు.



# భోళాశంకర్ చిత్రం తరవాత వశిష్టతో చిరు సినిమా




మెగాస్టార్ చిరంజీవి మంచి జోరు మీదున్నారు. యువ హీరోలకు దీటుగా సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'భోళా శంకర్ చిత్రం షూటింగ్ తుది దశలో ఉంది. ఆగస్ట్‌లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. తదుపరి రెండు చిత్రాలకు సై అన్నారు చిరంజీవి. 'బింబిసారా'తో హిట్ అందుకున్న వశిష్ఠతో ఓ సినిమా చేయనున్నారు. 'సోగ్గాడే చిన్నినాయన' ఫేం కల్యాణ్ కృష్ణ కురసాల కూడా చిరుకి ఓ కథ చెప్పి మెప్పించారు. ప్రస్తుతం చిరంజీవి చేతిలో ఈ రెండు చిత్రాలు ఉన్నాయి. వశిష్ఠ చిరంజీవి కోసం సోషియో ఫాంటసీ నేపథ్యంలో కథ తయారు చేశారు. ఇందులో ఎనిమిది మంది కథానాయికలు ఉన్నారని తెలిసింది. అందరి పాత్రలు కథకు కీలకంగానే ఉంటాయట. ఇప్పటికే హీరోయిన్ల వేట మొదలైందని సమాచారం. చిరు వయసుకీ, క్రేజ్‌కీ, ఈజ్‌కీ సరిపడా హీరోయిన్ల లిస్టు ఒకటి దర్శకుడు తయారు చేస్తున్నారు. ఇందులో స్టార్ హీరోయిన్లు ఉన్నారు. కొత్తగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన వాళ్లూ ఉన్నారు. ఆ సమయానికి ఎవరు అందుబాటులో ఉంటే వారిని ఎంపిక చేసుకునే దిశగా దర్శకుడి ఆలోచన ఉందట.వశిష్ఠ, కల్యాణ్ కృష్ణ సినిమాలు వశిష్ట సినిమాలు ఒకేసారి సెట్స్ మీదకు తీసుకుని పారలల్‌గా చిత్రీకరణ చేయాలని భావిస్తున్నారు. వశిష్ట కథలో గ్రాఫిక్స్ హంగులకు ప్రాధాన్యం ఉంది. దాంతో విడుదల కాస్త ఆలస్యం కావచ్చు. సంక్రాంతి బరిలో కల్యాణ్ కృష్ణ సినిమా ఉండొచ్చని భావిస్తున్నారు.



### ఆదిపురుష్ పాత్రలకు భిన్నంగా పేర్లు

#### రాముడిని మీసాలతో చూపించడంపైనా చర్చ

ప్రభాస్, కృతి సనన్ జంటగా నటించిన 'ఆదిపురుష్' సినిమా ఈనెల 16న విడుదల అవుతోంది. ఓం రౌత్ దర్శకత్వం వహించిన, ఈ సినిమా రామాయణం ఆధారంగా తీసినది. ఇందులో ఒక్కో పాత్ర పేరు ఒక వైవిధ్యంగా ఉండేట్టు పెట్టారు. ఇంతవరకు రామాయణం ఆధారంగా వచ్చిన తెలుగు సినిమాలు చూస్తే సీతారాములు, రావణుడు, లక్ష్మణుడు, శూర్పణఖ ఇలా తెలుగువాళ్ళ నోళ్ళలో నానే పేర్లే వినపడేవి. కానీ ఈ 'ఆదిపురుష్' లో కొంచెం వైవిధ్యంగా ఉంటాయి. రామ అని కాకుండా రాఘవ్ అని, సీతకి బదులు జానకి అని, రావణ పేరుని లంకేశ్వర్ అని, లక్ష్మణుడిని శేష్ అని ఇలా పెట్టారు. నార్త్ ప్రేక్షకులను అట్రాక్ట్ చెయ్యడానికి ఇలా పెట్టారా అంటే కాదు అని నిర్మాతల్లో ఒకరైన యూవీ క్రియేషన్స్‌కి చెందిన విక్రమ్ రెడ్డి అన్నారు. ఇందులో వాటి పాత్రలను చూపించామని చెప్పారు. ఇవన్నీ ఇలా ఉంటే మీసాలు పెట్టి, మీసాల రాముడిని చేసారు కదా అని అడిగితే, సినిమా చూస్తే ప్రేక్షకులకు అర్థం అవుతుంది, అందరికి నచ్చుతుంది అని చెప్పారు. ఇంతవరకు వచ్చిన పౌరాణిక సినిమాల్లో రాముడు, కృష్ణుడు పాత్రలకు ఎక్కడా మీసాలు పెట్టినట్టు లేదు. ఇప్పుడు ఈ 'ఆదిపురుష్' మాత్రం ప్రభాస్మీసాలతో కనిపించనున్నాడు. అయితే అప్పట్లో 'అన్నమయ్య' సినిమా అప్పుడు నాగార్జున ఆ పాత్ర చేసినప్పుడు ఇదే చర్చ జరిగింది. అన్నమయ్య కి మీసాలు ఉంటాయా అని, వుండవు అని ఇలా చర్చ జరిగినప్పుడు మీసాలు ఎందుకు వుండకూడదు అని నాగార్జున మీసాలతో నటించాడు. కె రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన ఆ సినిమా హిట్ అయింది కూడా. అందువల్ల రాముడికి కూడా మీసాలు ఉంటే తప్పులేదు అని అంటున్నారు. అలాగే ఈ సినిమా మోషన్ కేప్చర్, యానిమేషన్, ఇంకా రెగ్యులర్ పాత్రలతో పాటలు, సన్నివేశాలు ఇలా చిత్రీకరించారు. దానికి కూడా విక్రమ్ ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాలకు మోషన్ కేప్చర్ ని ఉపయోగించారు, అలాగే పాటల్లో, మిగతా సన్నివేశాల్లో మామూలుగా సినిమాల్లో వుండేట్టుగానే షూటింగ్ చేసి చేశారు అని చెప్పారు. సినిమాలో ఒక అరగంట యుద్ధ సన్నివేశాలు సినిమాకే హైలైట్ అని అవన్నీ మోషన్ కేప్చర్ లో చేశారని చెప్తున్నారు విక్రమ్.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in